
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం 6:25(సాయంత్రం)
సెహరీ : శుక్రవారం 4:48 (ఉదయం)

పింఛన్ల పంపిణీలో వైసీపీ వంచన

- అడ్డగోలుగా అధికార పార్టీ విష ప్రచారం
- వృద్ధులను నడిపించి సానుభూతి పొందేలా ప్లాన్
- పింఛను ఆలస్యంపై సమాచారమివ్వని అధికారులు
- ఉదయం నుంచే సచివాలయాల వద్ద పడిగాపులు



నంద్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్.. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేదు. రాష్ట్రాన్ని ఆయన నాశనం చేసిన తీరు, చెబుతున్న అబద్ధపు మాటలను చూస్తున్న ప్రతి ఒక్కరు ఈ సారి వైసీపీకి ఓటు వేస్తే తమ గొయ్యి తాము తవ్వుకున్నట్లేనన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ విషయాన్ని పసిగట్టిన వైసీపీ మరో సారి ఎన్నికల్లో గెలవాలంటే ఏదో బలమైన సానుభూతి కావాలని ఆలోచించింది. అవ్వా తాతలకు, దివ్యాంగులకు, వితంతువుల పింఛన్లు నిలుపుదల చేసి, ఆ పాపాన్ని ప్రతిపక్ష టీడీపీపై నెడితే తమ పార్టీకి ఓట్లు పడతాయని భావించింది. ఇదే అదనుగా భావించి, ఈనెల పింఛన్లు ఆలస్యమవుతాయని లబ్ధిదారులకు తెలియనివ్వకుండా, వలంటీర్లపై టీడీపీ చేసిన ఫిర్యాదు వల్లే పింఛన్లు ఆగిపోయాయని అసత్య ప్రచారానికి వైసీపీ బ్యాచ్ తెరలేపింది. పింఛను పడదని తెలిసినా, లబ్ధిదారులను సచివాలయాలకు నడిపించారు. తద్వారా వైసీపీ మీద సానుభూతి కలిగేలా తతంగాన్ని నడిపిస్తున్నారు ఆ పార్టీ నేతలు.

పింఛను లబ్ధిదారులకు ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పంపిణీ జరుగుతుంది. వలంటీర్లు ఉద్యోగులుగా కాకుండా, చేయాలని నిర్ణయించింది. అయితే పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి జరుగుతుందన్న సమాచారాన్ని లబ్ధిదారులకు అందేలా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. ఈ విషయం తెలియని లబ్ధిదారులు సచివాలయాల



చాగలమర్రి సచివాలయం వద్ద పింఛన్‌లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

● ముందస్తు సమాచారం ఇచ్చారా..?

వైసీపీ ప్రచార కర్తల్లాగా వ్యవహరిస్తున్న తీరుతో వారిని పక్కకు పెట్టాలని ఈసీ నిర్ణయించింది. వాస్తవానికి ఈ నెల పింఛను పంపిణీ ఆలస్యం కావడానికి, వలంటీర్లను పక్కన పెట్టడానికి ఎలాంటి సంబంధం లేదు. సంవత్సరాంతం కావడానికి తోడు, వైసీపీ దుష్టాలోచనే వల్లే పింఛను పంపిణీ ఆలస్యమైంది. ఇక పింఛను పంపిణీ సచివాలయాల ద్వారా

ఎదుట ఉదయం 7 గంటల నుంచే పడిగాపులుకాశారు. వీరికి సచివాలయ ఉద్యోగులు ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడంతో వచ్చిన వారంతా ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా డబ్బులు మధ్యాహ్నం నుంచి పడతాయని చాలాచోట్ల సమాచారం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అక్కడే ఉండిపోయారు.



నందికొట్కూరు: అల్లూరు గ్రామంలో వేచిఉన్న వృద్ధులు

● టీడీపీ నాయకులు కోరినా..

పింఛను పంపిణీని వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష కూటమిపైన బురదజల్లేందుకు వాడుకునేలా ప్రణాళిక రచించింది. దీనిని పసిగట్టినా జిల్లా టీడీపీ నాయకులు పింఛను గతంలో మాదిరిగానే ఇంటికి వెళ్లి ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని కోరింది. ఇక ఆరోగ్యం సరిగా లేని వారు, వితంతువులు, దివ్యాంగులకు పింఛను ఇంటి వద్దే అందించాలని సెర్ప్ సీఈవో మర్గదర్శకాలు జారీ చేశారు. టీడీపీ కోరినట్లు ఇంటికే చేరిస్తే తాము అనుకున్నది సాధించలేమనుకున్న అధికార పార్టీ కుట్రతో చాలామంది వృద్ధ లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించే పనికి పూనుకున్నట్లు సమాచారం. టీడీపీ కోరినట్లు ఇంటి వద్దకే పింఛను పంపిణీ చేస్తే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఉయ్యాలవాడలో..

● పంపిణీ పూర్తి చేయాలనుకుంటే..

పంపిణీ పూర్తి చేయాలంటే వలంటీర్లు ఉంటేనే సాధ్యమనే అర్థరహిత వాదనను వైసీపీ చేస్తోంది. వాస్తవానికి పింఛను పంపిణీ పూర్తి చేయడానికి ప్రభుత్వ యంత్రాంగానికి సచివాలయ ఉద్యోగులు సరిపోతారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి 50 ఇళ్లకు ఒకరి చొప్పున మొత్తం 7,011 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,300 మంది సచివాలయ సిబ్బంది ఉన్నారు. సచివాలయ ఉద్యోగులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే పింఛను లబ్ధిదారులకు చేరడానికి రెండు రోజుల సమయానికి మించి పట్టదు. వాస్తవానికి ప్రతి నెలా పింఛను దారులకు సంబంధించిన నిధులు ప్రస్తుతం కూడా పింఛను పంపిణీ సచివాలయ ఉద్యోగులు ద్వారానే చేస్తున్నారు. వాస్తవానికి ప్రతినెలా పింఛనుదారులకు సంబంధించిన నిధులు సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి తీసుకువస్తారు. ఆ తర్వాత వలంటీర్ల పరిధిలో ఎంత మంది పింఛను లబ్ధిదారులు ఉన్న సంఖ్యను బట్టి డబ్బులు అందజేస్తారు. ఈ లెక్కన వలంటీర్లు కేవలం పంపిణీ మాత్రమే చేస్తారు. కాబట్టి వారు ఉన్నా, లేకున్నా పింఛను పంపిణీలో ఎలాంటి ఇబ్బంది ఎదురవదు. ప్రస్తుతం కూడా పంపిణీ సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారానే జరుగుతోంది. ఈ విషయం అర్థం చేసుకున్న చాలామంది పింఛను లబ్ధిదారులు, ఇన్నాళ్లు వైసీపీ తమ పార్టీకి పింఛను తీసుకునే వారందరిని అనుకూలంగా మలుచుకునేందుకు వలంటీర్లను పావులుగా వాడుకుంటూ, కోట్ల రూ పాయల ప్రజాధనాన్ని వారికి కట్టబెట్టిందా? అన్న ప్రశ్నను లేవనెత్తుతున్నారు.

పింఛను పంపిణీ నిధులు బ్యాంకుల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి జమ అయ్యాయి. దీంతో చాలామంది లబ్ధిదారులకు పంపిణీ మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. కొన్ని చోట్ల సాయంత్రం నాలుగు గంటలకు, మరికొన్ని చోట్ల సాయంత్రం 5 గంటలకు ఇలా పంపిణీ మొదలైంది. ఆయా చోట్ల టోకెన్ విధానం ద్వారా డబ్బులను ఆయా లబ్ధిదారులకు అందజేశారు. పంపిణీ 40 శాతం మించి జరగలేదు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల వరకు 26 శాతం మాత్రమే పింఛను పంపిణీ జరిగిందని, రాత్రిలోపు అందిన నగదు వరకు లబ్ధిదారులకు అందించే ప్రయత్నం చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మధ్యాహ్నం 3 గంటల నుంచి..



చాగలమర్రి 5వ సచివాలయం వద్ద వేచిచూస్తున్న పింఛన్‌దారులు

● డబ్బుల్లేకనే డ్రామా

జిల్లా వ్యాప్తంగా 2.18 లక్షల మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా దాదాపు రూ.62 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రతి నెలా అప్పులు చేస్తూ లబ్ధిదారులకు ఎలాగోలా పంపిణీ పూర్తి చేసేది. రాష్ట్ర ప్రభుత్వానికి కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేకపోవడంతో జనవరి నుంచి సీఎం జగన్ ఆయా పథకాలకు సంబంధించి బటన్లు నొక్కుతున్నా లబ్ధిదారులకు డబ్బులు పడటం లేదు. ఇది బయటపడితే తాను మళ్లీ అధికారంలోకి వస్తే సంక్షేమం అందించలేనన్న విషయం తెలిసిపోతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు లేవన్న విషయాన్ని దాచిపెట్టి, ఆ నెపం ప్రతిపక్ష టీడీపీ మీద సీఎం జగన్ చాలా చాకచక్యంగా నెడుతున్నారు. ఈ నెల పింఛను డబ్బుల పంపిణీ ఆలస్యమవడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవటమే కారణం. బుధవారం డబ్బులు పంపిణీ చేస్తామని ప్రభుత్వ యంత్రాంగం చెప్పినా.. పై నుంచి ఆయా బ్యాంకు ఖాతాల్లో ఇంకా పూర్తి స్థాయిలో డబ్బులు జమకాలేదని సమాచారం. ఇప్పటి వరకు రూ.50 కోట్ల నగదు మాత్రమే జమయిందని, మిగిలిని నగదు గురువారం జమవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో చాలామంది లబ్ధిదారులకు సగం డబ్బులు మాత్రమే పడ్డాయి. ఇదే విషయాన్ని లబ్ధిదారులు సంబంధిత సచివాలయ సిబ్బందిని అడగ్గా.. రేపు లేదా ఎల్లుండి జమవుతాయని చెబుతుండటం గమనార్హం.

పటిష్టంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్

కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు




నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్టంగా అమలు చేస్తున్నామని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్ణయాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.శ్రీనివాసులు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సంబంధించి గురువారం ఈవీఎం రాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేక మంచానికే పరిమితమైన వారికి హోమ్ ఓటింగ్ పద్ధతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హోం ఓటింగ్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు.

కొత్త రూల్స్

- అహోబిలం యాత్రికులకు నిబంధనలు
- వన్యప్రాణుల రక్షణ కోసం మార్పులు
- వాహనాలకు టైం విధించిన అధికారులు



పావన లక్ష్మీ నరసింహస్వామి

రుద్రవరం, ఏప్రిల్ 3 : నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టులో భాగమైన నల్లమలలో ఉన్న పావన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోడానికి వెళ్లే భక్తులు, యాత్రికులు ఇక నుంచి కొత్త రూల్స్ పాటించాల్సిందే. ఆలయం పరిసరాల్లో అరుదైన ఎర్రచందనం చెట్లు, పెద్దపులులు, చిరుత పులులు, దుప్పులు, జింకలు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం జాతీయ పులుల సంరక్షణ సాధికార సంస్థ ఎన్‌టీసీఏ, అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ నాగార్జునసాగర్, శ్రీశైలం అటవీ ప్రాంతాన్ని టైగర్ రిజర్వుగా 1983లో ప్రకటించాయి. కోర్, బఫర్ ప్రాంతాలతో సహా ఈ టైగరు రిజర్వు విస్తీర్ణం 3726.87 చదరపు కి.మీలలో విస్తరించి ఉంది. దేశంలోనే అతిపెద్ద టైగరు రిజర్వు నాగార్జునసాగర్, శ్రీశైలం టైగరు రిజర్వులోని అహోబిలం పావన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. పావన లక్ష్మీనరసింహస్వామి ప్రాంతంలో ఐదు పెద్దపులులు సంచరిస్తున్నాయి.

అటవీ శాఖ నిబంధనలు ఇలా:

పావన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ప్లాస్టిక్ టీ కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్లు, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా నిషేధించాలి. ప్లాస్టిక్ వస్తువులు తీసుకువెళితే వాటిని బేస్ క్యాంపు వద్ద స్వాధీనం చేసుకుంటారు.

● వన్యప్రాణి సంరక్షణ ప్రాంతంలో కోర్, బఫర్ ప్రాంతం కారిడార్ జంతుబలులు నిషేధం. చట్టరీత్యా నేరం. పావన లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిసరాల్లో అటవీ చట్టం, జంతుబలుల నిషేధ చట్టం ప్రకారం మద్యపానం, ధూమపానం పూర్తిగా నిషేధం.

● వన్యప్రాణులు రాత్రి సమయంలో ఆహారం కోసం సంచరిస్తున్న సందర్భంలో ఏదైనా సంఘటన జరిగితే ప్రాణాపాయ పరిస్థితులు సంభవించే అవకాశం ఉన్నందున పావన నరసింహస్వామి ఆలయ ఆవరణలో పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట భక్తులు నిద్రించకూడదని అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు.

● భక్తులు తమ వాహనాలను సీతల్ బేస్ క్యాంపు వద్ద తప్పనిసరిగా తనిఖీ చేయించుకోవాలి.

● పావన నరసింహస్వామి ఆలయానికి భారీ వాహనాలైన లారీలు, బస్సులకు అనుమతి ఉండదు. ఆటోలు ద్విచక్ర వాహనాలు, జీపులను నిర్ణీత సమయంలోనే అడవిలోకి అనుమతిస్తారు.

● ప్లాస్టిక్ వ్యర్థాలు, మాంసం ఆహార వ్యర్థాలను అడవిలో పడేయరాదు. నీటి కుంటలను, జల ప్రదేశాలను కలుషితం చేయరాదు.



పావన లక్ష్మీనరసింహ క్షేత్రానికి వెళ్లే దారిలో చెక్‌పోస్ట్

వాహనాలను అనుమతించే సమయాలు:

సోమవారం నుండి గురువారం వరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం 3 వరకు మాత్రమే అనుమతిస్తారు.

యాత్రికులు తప్పనిసరిగా తమ వాహనాలు తనిఖీ చేయించుకుని పరిమిత యాత్రికులతో నిర్ణయించిన రేట్ల ప్రకారం రుసుం చెల్లించి నిర్దేశిత సమయంలోనే తిరిగి రావాలి.

● భక్తులు, యాత్రికులు అడవికి నిప్పు పెట్టరాదు. మందుబాటళ్లు తీసికెళ్లలేదు. ప్రభుత్వ ఆదేశానుసారం తగిన రుసుం చెల్లించాలి.


పెద్దపులుల సంఖ్య పెరిగినందు వల్లనే నిబంధనలు:



అటవీ ప్రాంతంలో పెద్దపులుల సంఖ్య పెరగడంతో ఉన్నతాధికారులు నిబంధనలు తీసుకొచ్చారు. నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలో పావన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అంతర్భాగం. భక్తుల వల్ల వన్యప్రాణులకు హానీ కలిగినా, వన్యప్రాణుల వల్ల భక్తులకు హానీ కలిగినా నిబంధనలు అమలు చేశాం.

- శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం

నల్లమలలోని పావన లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం



ప్రశాంత ఎన్నికల నిర్వహణే ధ్యేయం : ఎస్పీ



బనగానపల్లెలో పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

బనగానపల్లె, ఏప్రిల్ 3: బనగానపల్లె నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే ప్రధాన ధ్యేయమని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో పలు ప్రాంతాల్లో, వీధుల్లో సాయుధ పోలీసు దళాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించరాదని మైకుల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కుల, మత, వర్గ విబేధాలకు, విద్వేషాలకు దారితీసేలా ఎవ్వరూ ప్రసంగించరాదన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐలు సుబ్బారావు, తిమ్మారెడ్డి, నందివర్గం ఎస్ఐ తిరుపాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

- కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 3: డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలో గురువారం జరిగే నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో తీవ్ర మనోవేదనకు గురై బేతంచెర్ల మండలంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మృతి చెందారని అన్నారు. నిజం గెలవాలి పేరుతో నారా భువనేశ్వరి బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా ఇస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా గురువారం బేతంచెర్ల మండలంలోని హెచ్. కొట్టాల గ్రామంలో మధ్యాహ్నం 3.40 గంటలకు, గోరుమానుకొండలో సాయంత్రం 4.20 గంటలకు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారని అన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు

-మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు , ఏప్రిల్ 3 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి రూ.4వేల పింఛన్ అందించే ఏర్పాటు చేస్తామని బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం అవుకు పట్టణంలోని టీడీపీ నాయకుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి ఇంటికి చేరుకున్న బీసీకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎం.రామిరెడ్డిలతో కలసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని మండిపడ్డారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన రావడం వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొట్టరామిరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వర్‌రెడ్డి, ఇస్మాయిల్, చనుగొండ్ల మోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమణారెడ్డి, రైస్‌మిల్ రాయసం రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

తెలంగాణ పోలీసుల వింత వాదన

-మాండ్ర శివానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు ఏప్రిల్ 3: తన భార్య, కుమారులను అరెస్టు చేయలేదని, కేవలం 41(ఎ) నోటీసులు ఇచ్చేందుకే సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామని తెలంగాణ పోలీసులు వింత సమాధానం చెబుతున్నారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధం లేని కేసులో తన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కను అక్రమంగా అరెస్టు చేసి ఇప్పుడు కేవలం 41(ఎ) నోటీసులు ఇచ్చేందుకే సీసీఎస్‌కు తీసుకొచ్చామని అబద్ధాలు చెప్పడం ఏమిటన్నారు. అక్రమంగా అరెస్టు చేయడానికి వచ్చిన సీసీఎస్ పోలీసులపై హైకోర్టులో కేసు వేశామన్నారు. కేవలం తెలంగాణ సీపీ తనపై ఉన్న కక్షతోనే సంబంధంలేని కేసులో తనను, తన కుటుంబ సభ్యులను లాగుతున్నాడన్నారు. అందులో భాగంగానే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సీసీఎస్ పోలీసులు ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేసేందుకు ప్రయత్నించారన్నారు. నోటీసులు ఇస్తే సహకరిస్తామని చెప్పడంతో అల్లూరు నుంచి వెళ్లి పోయారన్నారు. ఈ కేసుతో తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని మాండ్ర శివానందరెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి జయసూర్య, నాయకులు షకీల్ అహ్మద్, ముర్తుజావళి, లాయర్ జాకీర్, గని తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతకంగా మారిన సాహస చర్య

గుండు ఎత్తే సమయంలో ప్రమాదవశాత్తు యువకుడి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 3: మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన యాదగిరి వీరేష్ (24) మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన మురళి అనే వ్యక్తి పెళ్లి ఊరేగింపులో గుండు ఎత్తబోయి ప్రమాదవశాత్తు అది మీద పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లికార్జున కుమారుడు యాదగిరి వీరేష్ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. తన కళ్ల ముందే గుండు మీద పడి కొడుక మృతి చెందడం పట్ల తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. పెళ్లిలో చోటు చేసుకున్న విషాదం గ్రామస్థులను సైతం విషాదంలో ముంచింది.

కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన అవసరం

● డీసీసీ అధ్యక్షుడు బాబురావు


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీసీసీ బాబురావు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన రావాల్సిన అవసరం ఉందని డీసీసీ అధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక, పార్టీ ఆర్థిక మూలాలు దెబ్బతిసేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు 1500 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం 114 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించిందని అన్నారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి పీజీ రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పరిగెల మురళీకృష్ణ పేర్లను ప్రకటించిందని అన్నారు. ఈ సమావేశంలో ప్రణాళిక కమిటీ చైర్మన్ రామస్వామి, కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డీసీసీ ఉపాధ్యక్షుడు బీ. బ్రతుకన్న, లాజరస్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రీ వాల్యూయేషన్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 2964 మంది పరీక్షలకు హాజరు కాగ 770 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

వెండి ఆభరణాలు సీజ్

● నిందితుడు అరెస్టు

బేతంచెర్ల, ఏప్రిల్ 3: బేతంచెర్ల బస్టాండులో తనిఖీలు చేస్తుండగా కర్నూలు నగరానికి చెందిన ఎస్ఎస్ అంబాషా అనే బంగారు వ్యాపారి వద్ద నుంచి సుమారు 2.36 కేజీల వెండి ఆభరణాలను, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన టి. నాగరాజు నుంచి 148.14 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.83వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూ.50వేలకు పైగా ఎటువంటి బిల్లులు లేకుండా బంగారు, వెండి ఆభరణాలను తీసుకెళ్లడం ఎన్నికల నియామవళి ఉల్లంఘన కింద వస్తుందని సీఐ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్

-అవయవ దానంతో పలువురికి జీవితం


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 3: ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఔదార్యంతో ఆ యువకుడి అవయవాలను దానం చేసి మరి కొందరికి ప్రాణం పోయడానికి సిద్ధమయ్యారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామానికి చెందిన కలుగొట్ల ప్రవీణ్ కుమార్ (28) అతని సోదరుడు రాఘవ బైక్‌పై ఆదివారం ఆత్మకూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రహదారి గుంతల వల్ల బైక్‌పై వెనుక కూర్చున్న ప్రవీణ్ కుమార్ కింద పడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితుడ్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా కోలుకోకపోవడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు ప్రవీణ్‌కుమార్‌ని బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు ప్రవీణ్ అవయవాలను దానం చేయాలని వైద్యులను కోరారు. వైద్యులు ప్రవీణ్ అవయవాలను సేకరించి పలువురికి దానం చేశారు. మృతునికి భార్య ప్రవల్లిక, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

శిథిల గోదాములు


నిరుపయోగంగా ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధీనంలోని గోదాములు

ఈ ఫోటోలో కనిపిస్తున్నది రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాము. ఇప్పుడు దాన్ని వ్యాపారులకు అద్దెకిచ్చారు. ఐదేళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో రైతులు దీనిలో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడం లేదు. ఎంతో కొంత ఆదాయం రాబట్టాలని అధికారులు దీన్ని తక్కువ అద్దెకు వ్యాపారులకు ఇచ్చారు. కేవలం 5 నుంచి 10 కోట్ల రూపాయలు ఖర్చు పెడితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని లాభపడేవారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదు.

- గత టీడీపీ హయాంలో కళకళ.. ప్రస్తుతం వెలవెల..
- మరమ్మతులపట్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ప్రైవేటు గోదాములకు పంట ఉత్పత్తులను తరలిస్తున్నరైతులు
- గోదాములను వ్యాపారులకు అద్దెకు ఇచ్చేసిన అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్), ఏప్రిల్ 3 : పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులు వాటిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో దాచుకొనేవారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.50 కోట్లు ఖర్చు చేసి ఈ గోదాములను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోలేదు. గత ఐదేళ్లుగా రైతులు ఈ గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం కోల్పోయారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములను రిపేరి చేసేందుకు స్థానిక అధికారులు రూ.10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటి దాకా నిధులు మంజూరు చేయలేదు. అరకొరగా.. నిధులు మంజూరైనా వాటితో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది. మూడు సంవత్సరాలుగా పౌర సరఫరాల సంస్థ అధికారులు కూడా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసేందుకు ఇష్టం చూపడం లేదు. ఆ శాఖ అధికారులు కూడా ప్రైవేటు గోదాములకు బియ్యాన్ని తరలిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గోదాముల్లో పేదల బియ్యం నిల్వ చేస్తే పాడవుతాయని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ షర్మిలతెలిపారు.

● రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో దుస్థితి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలు తమ పంటల ఉత్పత్తులను తక్కువ ధరకే ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేసుకొనేవారు. మార్కెట్‌లో మద్దతు ధర వచ్చాక అమ్ముకొనేవారు. వైసీపీ పాలనలో ఈ సంస్థ గోదాములు శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. ఈ పరిస్థితుల్లో కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీనగర్ సమీపంలో ఉన్న గోదాములను సంచుల వ్యాపారులకు, వివిధ రకాల వస్తువులు విక్రయించే వ్యాపారులకు అద్దెకు ఇచ్చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు ఆళ్లగడ్డ, డోన్, కర్నూలులో గోదాములు ఉన్నాయి. ఆళ్లగడ్డలో 11వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసే గోదాములు ఉండగా.. డోన్‌లో 2,100 మెట్రిక్ టన్నులు సామర్థ్యం ఉన్న గోదాములు కర్నూలు నగరంలో 13,700 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునే గోదాములు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గోదాముల్లో రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. రైతులు పంట ఉత్పత్తులను ఈ గోదాముల్లో నిల్వ చేసుకుంటే క్వింటానికి రూ.6.50 మాత్రమే చెల్లించాలి. ఈ సౌకర్యంతో పాటు 30 శాతం రిబేట్‌ను కూడా ప్రభుత్వం అందిస్తోంది. మరోవైపు రైతులు తమ అవసరాలను తీర్చుకునేందుకు పంట ఉత్పత్తులను బ్యాంకుల్లో కుదువపెట్టి 70 నుంచి 80 శాతం దాకా రుణాన్ని పొందేందుకు అవసరమైన ధృవీకరణ పత్రాన్ని కూడా ఎస్‌డబ్ల్యూసీ సంస్థ అధికారులు జారీ చేస్తున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో రూ. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన గోదాములు ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటం వల్ల పంట ఉత్పత్తులను రైతులు ప్రైవేటు గోదాములకు మరలించి క్వింటానికి రూ.12 ప్రకారం అద్దె చెల్లిస్తున్నారు.


రైతు సేవలు దూరమై వ్యాపారులకు నిలయంగా మారిన గోదాములు

గోదాములకు రూ.200 కోట్లు ఖర్చు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఏ మాత్రం గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి నాబార్డు ద్వారా దాదాపు రూ.200 కోట్లు ఖర్చు చేసి గ్రామాల్లోని నిర్జన ప్రదేశాల్లో గోదాములను పూర్తి చేస్తున్నది. ఈ గోదాముల నిర్వహణ కష్టమని, ఈ మారుమూల ప్రాంతాల్లోని గోదాముల్లో రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేస్తే భద్రత కల్పించడం వీలుకాదని అధికారులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా రూ.200 కోట్ల ఖర్చుతో వాటిని నిర్మిస్తున్నది.

● ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో భద్రత లేదు.

గతంలో సివిల్ సప్లయ్ సంస్థ ద్వారా పేదలకు పంచే బియ్యాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో నిల్వ చేస్తుండేవాళ్లం. ఆ గోదాములు శిథిలావస్థకు చేరడంతో అక్కడ పేదల బియ్యానికి భద్రత లేకుండా పోయింది. ప్రైవేటు గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేస్తున్నాం.

- షర్మిల, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్

ఆదాయం కోసం గోదాములను వ్యాపారులకు ఇస్తున్నాం



ఎస్‌డబ్ల్యూసీ ఆధ్వర్యంలోని గోదాములు కొంత మేరకు శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. వివిధ కారణాల వల్ల ఈ గోదాముల్లో సివిల్ సప్లయ్ అధికారులు బియ్యాన్ని నిల్వ చేయడం లేదు. అందుకని మేం కొన్ని గోదాములను వ్యాపారులకు అద్దెకు ఇచ్చాం.

● - ఆంజనేయులు, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్

సీఐని సస్పెండ్ చేయాలి

● ఎస్పీని కలిసిన టీడీపీ అభ్యర్థి టీజీ భరత్


ఎస్పీను కలిసేందుకు వస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: తమ పార్టీ నేతలను కొట్టిన సీఐ ఆదినారాయణ రెడ్డిని సస్పెండ్ చేయాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్పీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్‌లతో కలిసి ఆయన ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి సీఐ ఫోన్ చేసి పీఎస్ మీటింగ్‌కు రావాలంటూ 8 వార్డు టీడీపీ కార్పొరేటర్ పరమేష్, సీనియర్ నాయకుడు శేషగిరి శెట్టి, శ్రీకాంత్‌లను పిలిపించారన్నారు. అక్కడి నుంచి వారిని జగన్నాథ గట్టు మీద పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి బూతులు తిడుతూ కొట్టారని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో మద్దతు పెరుగుతోందన్న ఉద్దేశంతోనే కావాలని టార్గెట్ చేసి వీరిని కొట్టారని తెలిపారు. ఇందుకు కారణమైన సీఐ ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగని పక్షంలో ఎన్నికల కమిషన్‌ను, హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరుపుతామని ఎస్పీ హామీ ఇచ్చారన్నారు. జనసేన ఇన్‌చార్జి అర్షద్ మాట్లాడుతూ టీడీపీ నేలతపై దాడి జరిగిన రోజును చీకటి రోజుగా పేర్కొన్నారు.

ప్రైవేట్ కేసులు వేస్తాం



టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, కార్పొరేటర్ పరమేష్, సీనియర్ నాయకుడు శేషగిరి శెట్టిని పోలీసులు వేధించిన పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై పని చేసే టీడీపీ నాయకులను ఎట్లా కొడతారని ప్రశ్నించారు. అధికార వైసీపీ నాయకులు చెప్పినట్లు పోలీసులు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ వారిని వేధిస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై డీజీపీ, జిల్లా, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మిస్టరీగా రక్తపు మరకలు

- పోలీసు జాగిలాన్ని ఉపయోగించినా ఫలితం శూన్యం
- రక్తపు మరకలపై పలు అనుమానాలు...
- కేసు నీరుగారుస్తున్నారంటూ ఆరోపణలు


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

ఆదోని/ఆస్పరి, ఏప్రిల్ 3: ఆస్పరిలోని ఓ బొరుగుల బట్టీ, చర్చి, కస్తూర్బా పాఠశాల సమీపంలో మార్చి 25న రక్తపు మరకలు కనిపించడం ఇప్పటికీ అంతు తేలని మిస్టరీగానే ఉండిపోయింది. ఎవరినైనా హత్య చేసి, గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుండి తరలించారా...? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆస్పరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు జాగిలాలను పిలిపించి తనిఖీ చేశారు. పోలీసు జాగిలం చర్చి ఆవరణ అంతా తిరిగి జడ్పీ హైస్కూల్ ఆవరణలోకి వెళ్లి, ఆ తరువాత కస్తూర్బా పాఠశాల దగ్గరకు వెళ్లి ఆగిపోయింది. ఆ తరువాత పోలీసులు విచారణ చేపట్టారు. ఆ విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి వారం రోజులు పైనే గడుస్తున్నా... ఈ ఉదంతంపై పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం వెనుక రాజకీయ ప్రమేయం ఏమైనా ఉందా...? అనే అనుమానం తలెత్తింది.


చర్చి వెనుక భాగాన రక్తపు మరకలు

● క్లూ దొరకలేదు... - హనుమంతప్ప, సీఐ, ఆస్పరి

బొరగుల బట్టీ దగ్గర రక్తం ఎక్కువగానే పడి ఉంది. అనుమానంతోనే క్లూస్ టీం, పోలీసుల జాగిలాన్ని రప్పించాం. అక్కడ ఉన్న బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించాం. పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం.

గోల్‌మాల్..!

- కరస్పాండెంట్లు, గెస్ట్ ఫ్యాకల్టీలకూ అవకాశం
- ఆర్‌యూ బీఈడీ మోడరేషన్ బోర్డులో గందరగోళం
- కంట్రోలర్‌పై చర్యల కోసం విద్యార్థి సంఘాల పట్టు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా 39 బీఈడీ కళాశాలలు ఉండగా 2022-24 విద్యా సంవత్సరానికి గాను రెండవ సెమిస్టర్ రికార్డుల వెరిఫికేషన్(మాడరేషన్ బోర్డు)కు గతనెల 12న యూనివర్సిటీ పరీక్షల విభాగం బీఈడీ కళాశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. పీహెచ్‌డీతో పాటు 15 సంవత్సరాల టీచింగ్ అనుభవం ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. కానీ యూనివర్సిటీ పరీక్షల విభాగం కొన్ని కళాశాలల అధ్యాపకుల పేర్లను అర్హత లేకపోయినా మోడరేషన్ బోర్డుకు పంపించారు. వాటి ఆధారంగానే పరీక్షల అధికారి తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లను ఎంపిక చేసుకుని నిబంధనలు పాటించకుండా సభ్యులను ఎంపిక చేసినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అవకతవకలు ఇలా..

● సిల్వర్ జూబ్లీ కళాశాలలో ముగ్గురు గెస్టు ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారికి మోడరేషన్ బోర్డులో సభ్యులుగా తీసుకున్నట్లు ఆరోపణ.

● సిల్వర్ జూబ్లీ కళాశాలలో పని చేస్తున్న శరత్‌బాబు ఎమ్మిగనూరు పట్టణంలోని మదర్ థెరీస్సా బీఈడీ కళాశాలలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అయినప్పటికీ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయనకు అవకాశం కల్పించారు.



● డాక్టర్ వినోద్‌కుమార్ కోడుమూరులోని ఠాగూర్ బీఈడీ కళాశాలలో కరస్పాండెంట్ ఉన్నారు. ఆయన పేరు కూడా మోడరేషన్ బోర్డులో సభ్యుడిగా ఎలా నియమిస్తారన్నది ప్రశ్నార్థకం.

● ఆళ్లగడ్డ పట్టణంలో ఒక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ కర్నూలు నగరంలో మరోక కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ ఒకే వ్యక్తికి రెండు చోట్ల పనిచేస్తున్న ఆయనకు అవకాశం ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

● మోడరేషన్ బోర్డులో ఎంపికైన ముగ్గురు సభ్యులకు పీహెచ్‌డీ, 15 సంవత్సరాల అనుభవం లేకపోవడం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ అనంతరం అర్హత లేని వారిని కమిటి నుంచి తొలగించి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తాం.

- బి.సుధీర్ ప్రేమ్ కుమార్, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలి'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 3: నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని పరమటూరు సొసైటీ మాజీ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, మండల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు పిలుపునిచ్చారు. బుధవారం వారు మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక ఇద్దరు మృతి చెందారని, వారి కుటుంబాలను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నారాయపురంలో పరామర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'సాంకేతిక సదస్సులతో మేధస్సు పెరుగుతుంది'

పాణ్యం, ఏప్రిల్ 3: సాంకేతిక సదస్సులతో మేధస్సు పెరుగతుందని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ అన్నారు. కళాశాలలో బుధవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సాంకేతిక సదస్సు రిఫుల్ 2కె24ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. సదస్సులో ప్రదర్శించిన నైపుణ్యత, పరిజ్ఞానం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సుబ్బారెడ్డి, కన్వీనర్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌సుందర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



నాగరాజకుమార్

పాణ్యం, ఏప్రిల్ 3: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకుడు ఎన్.నాగరాజకుమార్‌కు కాకినాడ జేఎన్‌టీయూ కళాశాల డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 'మల్టీ మోడల్ మెడికల్ ఇమేజ్ మెటా హేరిస్టిక్ అప్రోచెస్ ఫర్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఆఫ్ మెడికల్ ఇమేజెస్' అంశంపై పరిశోధనకుగానూ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. అధ్యయనానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ గైడ్‌గా వ్యవహరించినట్లు నాగరాజ కుమార్ తెలిపారు. కళాశాల ఎండీ శివరాం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'మొక్కుబడిగా వేతన పెంపు'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 3: ఉపాధిహామీ కూలీలకు రూ.27 కేంద్ర ప్రభుత్వం మొక్కుబడిగా పెంచిందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డేవిడ్, సుబ్బరాయుడు అన్నారు. బుధవారం మండలంలోని శింగవరం గ్రామ పొలాల్లో పనుల వద్ద వారు కూలీలతో సమావేశం నిర్వహించారు. గతంలో రోజుకు ర.273 కూలీ ఇచ్చేవారని దానికి అదనంగా రూ.27 పెంచి రూ300 ఇస్తామని చెప్పటం తీరని అన్యాయమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెరిగి జీవనం కష్టంగా ఉందని, కనీసం రోజుకు రూ500 చెల్లించాలని, కూలీలకు పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

నల్లమలలో లారీ బోల్తా

మహానంది, ఏప్రిల్ 3: మహానంది మండలం నల్లమలలోని పచ్చర్ల ఘాట్ వద్ద బుధవారం మిర్చి బస్తాల లోడ్‌తో గుంటూరుకు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కోవెలకుంట్ల నుంచి గుంటూరుకు వెళ్తుండగా నంద్యాల- గిద్దలూరు మార్గంలోని పచ్చర్ల ఘాట్‌కు రాగానే మిరప బస్తాలు ఒక వైపుకు ఒరిగిపోవడంతో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేశారు.

వలంటీర్ల రాజీనామా

గడివేముల, ఏప్రిల్ 3: మండల కేంద్రంలో 14 మంది వలంటీర్లు రాజీనామ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరి తెలిపారు. మంగళవారం ఇద్దరు రాజీనామ చేయగా బుధవారం 12 మంది తమ రాజీనామ లేఖను ఇచ్చారని చెప్పారు. వీరిలో కొందరు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామ చేసినట్లు లేఖలో ప్రస్తావించారన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని భోజనం గ్రామానికి చెందిన నలుగురు గ్రామ వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన చాంద్‌బాఆ చంద్రపాల్, సురేష్, జ్యోతి రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేశారు. రాజీనామాలు ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు.

'ఎన్నికలకు సిద్ధం కావాలి'



జయలక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 3: ఏఐసీసీ నేత రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చే ఎన్నికలకు సన్నద్ధం కావాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం డీసీసీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో నంద్యాల నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీకి పది సంవత్సరాల ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం 9 గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టుతుందన్నారు. ఇటీవల రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షురాలిగా నియమితులైన జయలక్ష్మిని నాయకులు సన్మానించారు. జిల్లాలో సేవాదళ్ మహిళా విభాగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నరసింహ సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి'

మహానంది, ఏప్రిల్ 3: వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ప్రజలు వేసవి కాలంలో ఎండ తీవ్రత నుంచి ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై గోపవరం గ్రామంలో గాజులపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది స్వర్ణలత ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ ఎండ కాలంలో నీటిని ఎంత శాతం తీసుకోవాలని, అత్యవసమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. వడ దెబ్బ సోకినప్పుడు వెంటనే సమీపంలో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రవాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, సిబ్బంది తిలక్, రాముడు పాల్గొన్నారు.

పింఛన్ కోసం నిరీక్షణ

- తీవ్ర ఇబ్బందులు పడ్డ లబ్ధిదారులు
- సచివాలయాల చుట్టూ తిరిగిన వైనం



కోనేటమ్మపల్లె గ్రామంలో నిరీక్షిస్తున్న వృద్ధులు



గడివేముల: క్యూలో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

నందికొట్కూరు, ఏప్రిల్ 3: నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు క్యూకట్టారు. సచివాలయ ఉద్యోగులు పింఛన్ డబ్బులను డ్రా చేసేందుకు బ్యాంకుల వద్దే తిష్టవేశారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల సమయంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమఅయ్యింది. దీంతో సచివాలయ ఉద్యోగులు డబ్బులు డ్రా చేసి తీసుకొని వచ్చి సాయంత్రం 6గంటలకు పంపిణీ ప్రారంభించారు. నందికొట్కూరు పట్టణంలో సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ పంపిణీ చేశారు.

ఒక ఉద్యోగి 42 మందికి పంచలేరా..?

నందికొట్కూరు నియోకవర్గంలోని ఆరు మండలాల్లో 36,143 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఈ లబ్ధిదారులకు పంచేందుకు నియోజకవర్గంలో 86 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ఒక్కో సచివాలయంలో 10 మంది చొప్పన ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 420 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి 42 మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయవచ్చు.

చిక్కంతా డబ్బుతోనే..

ఎస్‌బీఐ ఖాతాల్లో మాత్రమే పూర్తిస్థాయి పెన్షన్ అమౌంట్ సచివాలయ ఉద్యోగులకు అందినట్లు తెలుస్తోంది. గ్రామీణ స్థాయిలో ఉన్న బ్యాంకుల్లోని అకౌంట్లకు 50 శాతం మేర అమౌంట్ చేరినట్లు తెలుస్తోంది.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలం పరిధిలోని కోనేటమ్మపల్లె, కోళ్ళబావాపురం, వడ్డెమాను గ్రామాలలో పింఛన్ కోసం లబ్ధిదారులకు పడిగాపులు తప్పలేదు. సాయంత్రం 5 గంటలైనా అధికారులు డబ్బులు అందలేదని పింఛన్ పంపిణీ మొదలు కాకపోవడంతో కోనేటమ్మ పల్లెలో వృద్ధులు చాలా డీలాపడిపోయారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఎట్టకేలకు పంపిణీచేశారు. ఎన్నికల కమిషన్ ఏదేశాల మేరకు సచివాలయాల వద్దే సిబ్బందితో పింఛన్ పంపిణీ చేపట్టినట్లు నందికొట్కూరు ఎంపీడీవో నరేష్ క్రిష్ణ తెలిపారు.

జూపాడుబంగ్లా: మూడు రోజులుగా పింఛన్లు రాలేదని ఎదురుచూస్తున్న వారికి బుధవారం కూడా మధ్యాహ్నం సగం మందికే డబ్బులు రావడంతో గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. గంటలోపే సగం మందికి డబ్బులు పంపిణీ చేసి ఎత్తేశారు. తాటిపాడు గ్రామంలో సాయంత్రం పంపిణీ చేస్తామన్న అధికారులు 6గంటలైనా పంపిణీ చేయలేదు. మండలంలో సగం మందికే పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఇన్‌చార్జిఎంపీడీవో నూర్జహాన్‌ను వివరణ కోరగా బ్యాంకుల్లో డబ్బులు ఇవ్వకపోవడంతో సగం మందికే ఇచ్చామని, తాటిపాడులో డబ్బులు తీసుకుని వచ్చి పంపిణీ చేస్తామని చెప్పారు.

పాములపాడు: మండలంలోని 25 గ్రామాలలో బుధవారం సాయంత్రం వరకు అధికారులు పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టలేదు. దీంతో వృద్ధులు సచివాయాల వద్ద పడిగాపులు కాశారు. ఎంపీడీవో సరస్వతిని వివరణ కోరగా బ్యాంకుల నుంచి డబ్బులు సమయానికి రాకపోవడంతో ఆలస్యమైందని, బానుముక్కల, బానకచెర్ల, జూటూరు1, జూటూరు 2, తదితర గ్రామాలలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం సాయంత్రం 5 తర్వాత చేపట్టామని తెలిపారు. గురువారం అన్ని గ్రామాలలో పంపిణీ చేస్తామని, పూర్తి స్థాయిలో డబ్బులు అందలేదని తెలిపారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలైంది. మధ్యాహ్నం వరకు బ్యాంకులలో నిధులు జమ కాకపోవడంతో నిధుల కోసం ఉద్యోగులు బ్యాంకుల చుట్టూ తిరుగుతుండగా పింఛన్‌దారులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడ్డారు.

గడివేముల: పింఛన్ పంపిణీ కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయం వద్దకు ఉదయాన్నే చేరుకున్నారు. పింఛన్ నగదు బ్యాంకులో జమ కాకపోవడం, బ్యాంకుల నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి ఆలస్యం కావడంతో సచివాలయ సిబ్బంది సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గడివేముల సచివాలయం-2 వద్ద పింఛన్ లబ్ధిదారులకు టెంటు, మంచి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో అవ్వా తాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పింఛన్‌ల కోసం క్యూలో వేచి చూశారు.

శ్రీశైలంలో విశేష పూజలు

శ్రీశైలం, ఏప్రిల్ 3: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులను సమర్పించారు. అలాగే మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఏప్రిల్ 3: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన కాలాబ్లోమ్ కళాకారుల బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, జతిస్వరం, మహేశ్వరిమహాంకాళి, శివస్తుతి, శివాష్టకం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు, ఏప్రిల్ 3: ఆత్మకూరు పట్టణంలో వెలసిన గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ద్విపుష్కర(24) వార్షిక వేడుకల్లో భాగంగా మూడో రోజైన బుధవారం లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సుప్రభాతసేవా, ఆరాధన, నివేదన, గోష్టి, చతుఃస్థానార్చన, హోమాలు, శాత్తుమొరై, తీర్థ ప్రసాద గోష్టి వంటి క్రతువులను వేదపండితుల నిర్వహించారు. చివరగా పూర్ణాహుతి, బలిప్రదానం, వాహనో త్సవం, ఆలయ ప్రవేశం, శాత్తుమొరై, తీర్థప్రసాద గోష్టి, శయ్యాసనం వంటి కార్యక్రమాలను జరిపారు. శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిపై ఆరుగురి దాడి

శ్రీశైలం, ఏప్రిల్ 3: శ్రీశైలంలో నివాసముంటున్న శీలం ప్రసన్న కుమార్ అనే యువకుడిపై మంగళవారం అర్ధరాత్రి ఆరుగురు దాడి చేశారు. దాడికి సంబంధించిన వీడియో మీడియాలో చెక్కర్లు కొట్టడంతో విషయం వెలుగులోనికి వచ్చింది. బాధితుడు శీలం ప్రసన్న కుమార్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. మంగళవారం రాత్రి దేవస్థానం పరిధిలోని నంది సర్కిల్ సమీపంలోని ఓ దుకాణంలో అల్పాహారం చేయడానికి వచ్చిన సుబ్బయ్య అనే యువకుడు ద్విచక్రవాహనం అడ్డుగా ఉందని ప్రసన్న కుమార్‌తో గొడవకు దిగారు. కొంత సమయం తరువాత చంద్రశేఖర్ అనే యువకుడు ప్రసన్నకు ఫోన్ చేసి వాసవీ సత్రం దగ్గరికి పిలిపించి ఐదుగురితో కలిసి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ యువకులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

రాక్షస పాలనకు అంతం తప్పదు: జయసూర్య



నందికొట్కూరులో మాట్లాడుతున్న జయసూర్య

నందికొట్కూరు ఏప్రిల్ 3: రాక్షస పాలనకు అంతం తప్పదని నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య అన్నారు. బుధవారం సూపర్ 6, డోర్ టూ డోర్ శంఖారావం కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని 20వ వార్డు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, నందికొట్కూరు పట్టణంలోని 20వ వార్డులో తాలుకా ఆఫీస్ రోడ్డు, రామాలయ వీధిలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 పథకాలను పట్టణ ప్రజలకు జయసూర్య వివరించారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'తర్తూరు జాతరను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న రూరల్ సీఐ విజయభాస్కర్

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 3: తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రూరల్ సీఐ విజయభాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం తర్తూరు దేవాలయంలో అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం సర్పంచ్ నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమయే ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసుశాఖ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ రామాచారి మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్తు సరఫరా ఎటువంటి అంతరాయం కలగకుండా చూస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర మాట్లాడుతూ 2 నుంచి 3లక్షల వరకు జాతరకు వస్తారనే అంచనాతో అందుకు సంబంధించి తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దాతలు కూడా స్పందించి ట్యాంకర్ల ద్వారా, చలివేంద్రాల ద్వారా తాగునీటిని అందించాలని కోరారు. పీఆర్ ఏఈ బషీర్, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఆర్టీసీ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 3: కెనరా బ్యాంకు నంద్యాల బ్రాంచ్-2 ఆధ్వర్యంలో సీఎస్సార్ ఆక్టివిటీ కింద కొత్తపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు క్రీడా వస్తువులు పంపిణీ చేశారు. కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ గంగాధరరావు, బ్యాంకు సిబ్బంది, పాఠశాల హెడ్‌మాస్టర్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతుల నిరసన



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

నందికొట్కూరు, ఏప్రిల్ 3: నందికొట్కూరుకు చెందిన పొలాలకు రహదారి మూసి వేశారంటూ రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. 340-సిలో జాతీయ రహదారి వేస్తున్న కారణంగా నందికొట్కూరు నుంచి బైరాపురం వెళ్లే రోడ్డు మూసివేశారు. జాతీయ రహదారి నుంచి రోడ్డును అనుసంధానం చేయాలని గ్రామస్థులు, రైతులు కోరినా మొదట సరే అన్న కాంట్రాక్టర్ రహదారిని మూసి వేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన కాంట్రాక్టర్ రెండు మూడు రోజుల్లో రోడ్డును వేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. పట్టణానికి చెందిన భాస్కర్‌రెడ్డి, రమేష్, రామకృష్ణగౌడ్, రైతులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో గేటుకు తాళం



గాజులపల్లి ఆర్ఎస్ కలప డిపోలో ప్రధాన గేట్‌కు తాళం వేసి కాపలా కాస్తున్న సిబ్బంది

మహానంది, ఏప్రిల్ 3: అక్కడ అంతా గోప్యం.. విచారణ పేరుతో కార్యాలయానికి తాళం వేశారు. ఇది అటవీశాఖ నిర్వాకం. మంగళవారం అక్రమంగా అటవీ సంపదను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు. మహానంది మండలం పరిధిలో ఆ వాహనాన్ని వెంబడించి అందులోని కలప ముక్కలతో సహా గాజులపల్లి ఆర్ఎస్‌లోని అటవీశాఖ కలప డిపోకు తరలించినట్లు అధికారులు తెలిపారు. అయితే సీజ్ చేసిన వాహనాన్ని ఉంచిన ప్రాంతం కలప డిపోలోకి వెళ్లకుండా ముందుగానే ప్రధాన గేట్‌కు తాళం వేసి కాపలదారుని చేత నో ఎంట్రీ అని చెప్పించడం విడ్డూరంగా ఉంది. అటవీశాఖలో పనిచేసే కొంతమంది సిబ్బంది ప్రమేయం కూడా అటవీ సంపద అక్రమ రవాణాలో హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని కప్పి పుచ్చేందుకే కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్యను వివరణ కోరగా నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న కలప ముక్కలను, వాహనాన్ని వెంబడించి స్వాధీనం చేసుకున్నామని, దీనిపై గాజులపల్లి ఆర్ ఎస్‌లోని అటవీ కలప డిపోలో నిందితులను విచారిస్తున్నామని చెప్పారు. దీని కోసం ఆ పరిసరాల్లోకి ఎవ్వరినీ అనుమతించకుండా ప్రధాన గేట్‌కు తాళం వేశారన్నా. విచారణలో సూత్రధారులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. త్వరలోనే ఇందులో ఎంత మంది హస్తం ఉందనే వివరాలను తెలుపుతామని చెప్పారు.

టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి: బుడ్డా



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, ఏప్రిల్ 3: టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. వెలుగోడు పట్టణంలోని ఎస్సీ కాలనికి చెందిన టీడీపీ నాయకుడు జాకటి చంద్ర ఆధ్వర్యంలో 40 దళిత కుటంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరు వేల్పనూరులోని మాజి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇంటికి చేరుకుని ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంతో మందికి రుణాలు అందించారన్నారు. క్రిస్మస్ కానుక అందించారన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం: శబరి



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

పాణ్యం, ఏప్రిల్ 3: కలిసికట్టుగా కృషి చేసి వైసీపీని ఇంటికి సాగనంపాలని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీడీపి నాయకుల పరిచయ వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కల్లూరు మండలంలో పందిపాడు గ్రామంలో ఆరుగురు టీడీపీ కార్యకర్తలను పోలీసు స్టేసన్‌కు తీసుకువెళ్లి కొట్టడం అమానుషమని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత మాట్లాడుతూ పార్టీ శ్రేణులు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే కాటసాని తాను, తన కార్యకర్తలు అక్రమంగా సంపాదించుకోవడినికే తప్ప నియోజవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ దుర్మార్గుల పాలన నుంచి ప్రజలను కాపాడుకోవాలంటే టీడీపీని గెలిపించుకోవడమే మార్గమని అన్నారు. ఎంసీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడుచింతా సురేష్‌బాబు, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు గణపం జయరామిరెడ్డి, రమణ మూర్తి, ఖాదర్‌బాషా, రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు భూపనపాడుకు నారా భువనేశ్వరి

పాణ్యం, ఏప్రిల్ 3: మండలంలోని భూపనపాడు గ్రామానికి నారా భువనేశ్వరి గురువారం విచ్చేస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 24న నారా చంద్రబాబు అరెస్టుకు తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన బొనిగెని శివరాముడు కుటుంబాన్ని ఆమె పరామర్శిస్తారని చెప్పారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు

గడివేముల, ఏప్రిల్ 3: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండలంలోని గని గ్రామంలో బుధవారం ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీని గెలిపిస్తేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమాలు, అన్యాయాలే తప్పా అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జిల్లా మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ రఫీక్, పంట రామచంద్రారెడ్డి, గని హర్షవర్ధన్, మురళీమోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

- గని గ్రామ మాజీ సర్పంచ్ ప్రసాదు పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత గని మాజీ సర్పంచ్ ప్రసాదుకు పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పాణ్యం, ఏప్రిల్ 3: మండలంలోని భూపనపాడు టీడీపి కార్యకర్త సునీల్‌ను బుధవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సునీల్ ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, రమణ మూర్తి, ఖాదర్‌బాషా, అమరసింహారెడ్డి, సుబ్బయ్య, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: ఫరూక్



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రజలు వ్యవస్థలలో, పరిపాలన విధానాలలో మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పు కూటమి ద్వారానే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, టీడీపీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో జనసేన నంద్యాల సమన్వయకర్త విశ్వనాథ్, జనసేన నాయకులు సుధాకర్, రవితో కలిసి ఫరూక్ మాట్లాడారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన పార్టీ టీడీపీయేనని అన్నారు. ప్రభుత్వ అక్రమాలపై రాష్ట్రంలోని దళితులు, బీసీలు ప్రశ్నిస్తుంటే వారిపై దాడులకు బరితెగిస్తున్నారని, అక్రమ కేసులు బనాయించి దళితులపై 6 వేల కేసులు పెట్టగా 188 మంది దళితులు హత్యకు గురయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం'

ఆత్మకూరు, ఏప్రిల్ 3: టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని ఆత్మకూరు పట్టణ టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు రామకృష్ణ, నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇరగదిండ్ల మురళీలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ స్థాయిలో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల చేయూతనిచ్చి అండగా నిలిచింది టీడీపీయే అని అన్నారు. టీడీపీ నాయకులు కలీముల్లా, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, నాయకులు నాగూర్‌ఖాన్, రామనర్సయ్య, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి'



గువ్వలకుంట్లలో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తపల్లి, ఏప్రిల్ 3: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ సూచించారు. బుధవారం నందికుంట, వీరాపురం, గువ్వలకుంట్ల, బావాపురం గ్రామాల్లో సీఐతో పాటు ఎస్ఐ హరిప్రసాద్, కేంద్ర ఎన్నికల పోలీసు బలగాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు.

టీడీపీలో చేరిన కమలాపురం వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వారితో కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 3: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సుజాతమ్మ సమక్షంలో కమలాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. కమలాపురం వైసీపీ కార్యకర్తలు విశ్వనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, తిమ్మారెడ్డి, శాంతికుమార్, గోపాల్ రెడ్డి, రవి, శివ, షేక్షావలి, జింక శ్రీనులతో పాటు మరో 50 మందికి కోట్ల సుజాతమ్మ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్యాపిలి: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కోరారు. బుధవారం మండలంలోని గుడిపాడు, ఊట కొండ గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. గుడిపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ వర్గీయులు కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, టి శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు, ఆర్ఈ నాగరాజుల, అలేబాదు పరమేష్, రామ్మోహన్‌యాదవ్, గండికోట రామసుబ్బయ్య, చిన్నవెంకటరెడ్డి, సిద్ధారెడ్డి, ప్రతాప్, ఓబులేసు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు న్యాయం

ప్యాపిలి, ఏప్రిల్ 3: టీడీపీతోనే యువతకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. నాయకులు రామ్మోహన్‌యాదవ్, అంకిరెడ్డి, మధుకుమార్, నాగేంద్ర, గండి కోట రమేష్, వెంకటేసు, బాలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు భరోసా

డోన్, ఏప్రిల్ 3: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువతకు భరోసా ఉంటుందని ఆ పార్టీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. బుధవారం పట్టణంలోని 30వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. మెగా డీఎస్సీ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి సీఎం జగన్ మోసం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్ నాయుడు, కేఈ శ్యాం, మర్రి మణి, భాష్యం శ్రీధర్, బైసాని రాజు, ఎల్లగౌడు, వెంకటసుబ్బయ్య, మిషా, నెట్టికల్ రామాంజనేయులు, దస్తగిరి పాల్గొన్నారు.

టీడీపీ విజయం తథ్యం

బేతంచెర్ల, ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం నగర పంచాయతీలోని 20, 14వ వార్డు లలో పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలకు రక్షణ కల్పించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన మాధవిరెడ్డి, మేకల నాగరాజు, మల్లిపెద్ది నాగేశ్వరరెడ్డి, మధు లోకేశ్వరరెడ్డి, ఆవతి చంద్ర, శ్రీరాములు, సూర్యచంద్రరెడ్డి, కానాల అంజి పాల్గొన్నారు.

వ్యక్తిగతంగా విమర్శించుకుంటే చర్యలు: డీఎస్పీ

బనగానపల్లె, ఏప్రిల్ 3: టీడీపీ, వైసీపీ నాయకులు వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవద్దని, అలా చేస్తే ఎన్నికల కోడ్ ప్రకారం చర్యలు తీసుకుంటామని నియోజకర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి రాజకీయ నాయకులకు సూచించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో నియోజకర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బుధవారం టీడీపీ, వైసీపీ నాయకులతో వేర్వేరుగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందు వల్ల సోషల్ మీడియాలోగాని, ప్రెస్ మీట్‌లలో గాని వేరే పార్టీలకు సంబంధించి అనుచిత వ్యాఖ్యలు చేయరాదని కోరారు. కార్యక్రమంలో సీఐ గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి, నందివర్గం ఎస్ఐ తిరుపాల్ పాల్గొన్నారు.

ఆర్డీవోను కలిసిన న్యాయవాదులు



డోన్(రూరల్), ఏప్రిల్ 3: డోన్ బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన న్యాయవాదులు బుధవారం డోన్ ఆర్డీవో రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డోన్ ఆర్డీవోను కలిసిన వారిలో జిల్లా ఆర్డీఐ హై లెవెల్ కమిటీ అఫిషియల్ మెంబర్ పులి దామోదర్‌తో పాటు డోన్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్, జాయింట్ సెక్రటరీ టీఈ నాగరాజుగౌడు, కోశాధికారి మంగమూరి శ్రీను, న్యాయవాది ఈశ్వరయ్య ఉన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి

డోన్(రూరల్), ఏప్రిల్ 3: డోన్ పట్టణం కొండపేటలో నివాసముంటున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. సుగుణమ్మ భౌతికకాయానికి సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మోటరాముడు, మండల కార్యదర్శి పులిశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్, సీపీఐ కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైసీపీ స్వార్థ రాజకీయాలతో... వృద్ధుల అవస్థలు





డోన్, చాగలమర్రిలో సచివాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

డోన్(రూరల్), ఏప్రిల్ 3: అధికార వైసీపీ చేసిన రాజకీయ కుట్రలో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజకీయ స్వార్థం కోసం పింఛన్లను కావాలనే ఆలస్యం చేసిన ప్రభుత్వ నిర్వాకంతో వృద్ధులు, లబ్ధిదారులు గంటలకొద్దీ పింఛన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డోన్ పట్టణంలోని పలు సచివాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు పడిగాపులుగాచారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత సచివాలయాలకు పింఛన్ల డబ్బు వస్తుందని సమాచారం రావడంతో వృద్ధులు, వితంతువులు సచివాలయాల వద్దకు చేరుకు న్నారు. పలు సచివాలయాల్లో 5 గంటలకు పింఛన్లు డబ్బు రావడంతో టోకెన్ల పద్ధతి ద్వారా నగదును అందజేశారు.

ప్యాపిలి: మండలంలో పింఛన్ల కోసం బుధవారం వృద్ధులు, వికలాంగులు సచివాలయాలు, గ్రామాల్లో రచ్చబండల దగ్గర ఎదురు చూశారు. మండలంలో రూ.2.5 కోట్ల పింఛన్ డబ్బులు అవసరం కాగా



ప్యాపిలి మండలం హెచ్‌ఆర్‌పల్లిలో..

రూ.కోటి మాత్రమే వచ్చాయని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు.

బనగానపల్లె: గ్రామ సచివాలయాల దగ్గరికి బుధవారం ఉదయం నుంచే పింఛన్‌దారులు చేరుకున్నారు. కానీ బ్యాంకులకు పింఛన్ డబ్బులు జమ కాకపోవడంతో వారు వెను దిగిరిపోయారు. బనగానపల్లె పట్టణంలోని 25 గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆయా గ్రామ సచివాలయాల్లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని ఆయా సచివాలయాల పరిధిలో బుధవారం పింఛన్ కోసం లబ్ధిదారులు నిరీక్షించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా సచివాలయాల ముంగిట బైఠాయించారు. పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు కాశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పింఛన్ల పంపిణీ మందకొడిగా సాగింది. పట్టణంలోని 12 సచివాలయాల పరిధిలో పింఛదారులకు పింఛన్లు పంపిణీ కాలేదు. దీంతో పింఛన్‌దారులు ఇబ్బం దులు పడ్డారు. బ్యాంకు నుంచి డబ్బులు అందక పోవడంతో పింఛన్లను పంపిణీ చేయలేక పోయామని కమిషనర్ రమేష్‌బాబు చెప్పారు.

శిరివెళ్ల: మండలంలోని సచివాలయాల వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారులు ఉదయం నుంచే పడిగాపులు పడ్డారు. ఏప్రిల్ 3న పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు సచివాలయ వద్దకు చేరుకున్నారు. బ్యాంకుల నుంచి నగదు అందకపోవడంతో మధ్యాహ్నం వరకు సచివాలయాల వద్ద వేచి ఉన్నారు. 6వ తేదీలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీవో ఫణి రాజకుమారి తెలిపారు.

డోన్‌ను కర్నూలు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తా

టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 3: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాల జిల్లాలో ఉన్న డోన్ నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటాపురం మనోహర్ రెడ్డి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి స్వగృహంలో కోట్ల మాట్లాడుతూ సీఎం జగన్ దోపిడీ విధానాల వల్లనే ఖజానా ఖాళీ అయిందని ఆరోపించారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసినా ఉద్యోగులకు జీతాలు, పేదలకు పింఛన్ల డబ్బు ఇవ్వలేక పోవడం వైసీపీ వైఫల్యమే కారణమన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, జగదుర్తి ప్రతాప్ రెడ్డి, రాజేశ్వరరెడ్డి ఉన్నారు.

టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగు

బేతంచెర్ల: టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాలో వెలుగు నింపుతుందని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని తవిసికొండ, హుశేనాపురం, గూటుపల్లె గ్రామాల్లో మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రచారం



డోన్‌లో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నీ కొల్లగొట్టారన్నారు. సంపద సృష్టించలేక ఉన్న సహజ వనరులను కొల్లగొట్టి, తన బినామి కంపెనీలకు మళ్లించారని ధ్వజమెత్తారు. మరోసారి జగన్ రెడ్డి అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా తీయించి మరో బీహార్ రాష్ట్రంగా మారుస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుల్ల య్య, వెంకట్రాముడు, ముల్లా, రామతిమ్మారెడ్డి, మోహన్, శ్రీరాములు, మధు, శేఖర్, భీమన్నగారి మోహన్, నాయిని రామక్రిష్ణ, గోపాల్, మురళి, మనోహర్, సురేంద్ర, జయరాముడు, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

ఎండీయూ ట్రక్కుపై జగన్ ఫొటో

నిబంధనలు ఉల్లంఘించి రేషన్ పంపిణీ

రుద్రవరం, ఏప్రిల్ 3: మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామంలో బుధవారం ఎండీయూ ట్రక్కు ద్వారా రేషన్ బియ్యం బుధవారం పంపిణీ చేశారు. ఎండీయూ ట్రక్కుపై ఒక వైపు ఉన్న సీఎం బొమ్మపై కాగితాలు అతికించారు. మరో వైపు సీఎం బొమ్మను అలాగే ఉంచారు. ఎన్నికల కోడ్ మార్చి 16న అమలు కాగానే నాయకుల బొమ్మలు తొలగించాలని నిబంధనలు ఉన్నాయి. అయితే ఎండీయూ ట్రక్కుకు ఒక వైపు సీఎం ప్రతిమను అలాగే ఉంచారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు ప్రారంభం

రుద్రవరం, ఏప్రిల్ 3: రుద్రవరం తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చలివేంద్రాలు ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నట్లు తహసీల్దారు మురళీమోహన్ తెలిపారు. కార్యాలయాలకు తరలివచ్చిన ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామచంద్ర చలివేంద్రాన్ని ప్రారంభించారు.

టీడీపీలో చేరిక

నంద్యాల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి)/చాగలమర్రి: చాగలమర్రి మండలం డి.వనిపెంట గ్రామానికి చెందిన ఆకుల నరసింహులు, ఆకులరాముడు, తిరుపాల్‌నాయక్, వస్త్రనాయక్, చాకలి నరసింహుడుతో పాటు మరో 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బుధవారం ఆళ్లగడ్డలోని భూమా నివాసంలో వీరికి కండువా వేసి టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి టీడీపీలోకి ఆహ్వానించారు.

వైభవంగా పూర్ణాహుతి

చాగలమర్రి, ఏప్రిల్ 3: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో బుధవారం శంకరానందస్వామి 54వ ఆరాదన మహోత్సవాలను అభినవ శంకరానంద స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, పూర్ణాహుతి హోమాలు చేశారు. ఉరవ కొండకు చెందిన రాజేంద్రస్వామిజీ, కాళహస్తికి చెందిన స్వప్రకాశానందస్వామి, ఆదోనికి చెందిన అనంతానందగిరి స్వామి, ఆళ్లగడ్డ యోగేశ్వరానందగిరి స్వాములచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఏప్రిల్ 3: చాగలమర్రి గ్రామంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల, గుంతపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు నారాయణరెడ్డి, జైలాబ్దిన్ ఉన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

చాగలమర్రి, ఏప్రిల్ 3: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి గ్రామానికి చేరుకొని పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు బాబయ్య, కిట్టు, నర్సిరెడ్డి, గోపాల్ ఉన్నారు.

పి.చింతకుంటలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఇంజేటి నాగిరెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంట గ్రామంలో ఇంజేటి నాగిరెడ్డి ఆయన స్వగృహంలో ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా ముస్లీంలు ఒక్క పొద్దు (ఉపవాసం) విడిచే సమయంలో ముస్లింలతో కలిసి ఫాతేహాలు చేశారు. అనంతరం ఆయన ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు.

వైసీపీకి భారీ షాక్

బీసీ సమక్షంలో బనగాపల్లె వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌తోపాటు 35 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 3: బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో వైసీపీకి బుధవారం షాక్ తగిలింది. గ్రామానికి చెందిన చెందిన బనగానపల్లె నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ సాధుల శివశంకర్ రెడ్డితో పాటు 35 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వైసీపీకి చెందిన కంకరరామచంద్రారెడ్డి, వెంగళరెడ్డి, ఎర్ర పాపన్నగారి రాజుయాదవ్, పొట్టన్నగారి రాముడుయాదవ్, జయన్న యాదవ్, రాజుయాదవ్, బోయ శ్రీనివాసులు, వడ్డెభాను, వలంటీర్ భూపాల్, బండి వంశీ, కాకనూరు విజయ్, జానకిరాముడు, సత్యం, రామ్మోహన్, గౌండా సుబ్బా, బాలు, తదితర 35 కుటుంబాలు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బనగానపల్లె నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే బీసీ జనార్ధన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. ఈసందర్భంగా బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉటుందని బీసీ తెలిపారు.

టీడీపీ నాయకుడి సతీమణి మృతికి సంతాపం

బనగానపల్లె, ఏప్రిల్ 3: బనగానపల్లె మండలం కృష్ణగిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, బనగానపల్లె మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కోడి నాగరాజు సతీమణి లక్ష్మీదేవి(50) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీజనార్ధన్‌రెడ్డి లక్ష్మీదేవి భౌతిక కాయానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని బీసీ తెలిపారు. అలాగే లక్ష్మీదేవి మృతికి యాదవసంఘం నాయకులు, టీడీపీ నాయకులు నివాళి అర్పించారు.

టీడీపీ కూటమి గెలుపునకు కృషి చేద్దాం

డోన్, ఏప్రిల్ 3: టీడీపీ కూటమి గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర పార్టీ కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేఈ, కోట్ల కుటుంబాలు ప్రజాక్షేమం దృష్టిలో ఉంచుకుని కలిసిపోయారన్నారు. టీడీపీకి నష్టం కలిగించే మాటలు మాట్లాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ప్యాపిలి మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భూమా నాగన్న, నారాయణ స్వామి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ 16రోజుల పండుగ

బనగానపల్లె, ఏప్రిల్ 3: మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్దమ్మతల్లి 16రోజుల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. జాతర అనంతరం పెద్దమ్మతల్లి విగ్రహాన్ని నంద్యాల రహదారిలోని పెద్దమ్మ దేవస్థానంలో అమ్మవారిని కూర్చోబెట్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మందికి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంబరాల పేరిట దూలపు పందేలాను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉక్కపోతలో చిన్నారులు విలవిల

- అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరాలేక పనిచేయని ఫ్యాన్లు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 3: మండలంలోని అంగన్‌వాడీ చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. గత మూడు ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్ సరఫరాలేక ఫ్యాన్లు తిరగటం లేదు. మండలంలో 29 అంగన్‌వాడీ కేంద్రాలు అందులో దాదాపుగా 500 మంది చిన్నారులు, 200 మంది బాలితలు, గర్భిణులు ఉంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐదు ఏళ్లలోపు చిన్నారులు దాదాపుగా రోజుకు ఏడు గంటల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలోనే ఉంటున్నారు. ఫ్యాన్లు పనిచేయకపోవటంతో చిన్నారులు ఉక్కపోతనుకు తట్టుకోలేకపోతున్నారు. ఏడాది క్రితం అంగన్‌వాడీ కేంద్రాలకు మినరల్ వాటర్ మిషన్లు మంజూరు అయ్యాయి. విద్యుత్ సరఫరా లేకపోవటంతో అవి పనిచేయక, వృథాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా అందించాలని కోరుతున్నారు.

బిల్లులు చెల్లించపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్



ఉయ్యాలవాడ నాలుగో సెంటర్‌లో ఉక్కపోత తట్టుకోలేక పలకలతో గాలి విసురుకుంటున్న చిన్నారులు

అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీని విషయమై ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశాం.

- దీప్తి, సూపర్‌వైజర్

9 నుంచి ఉగాది బ్రహోత్సవాలు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 3: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 9వతేది నుంచి ఉగాది బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి. కామేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 9వ తేదీ మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం, సాయంత్రం 5 గంటల నుంచి ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లు తిప్పడం, 6.30 గంటల ప్రాకార రథోత్సవం, 10వ తేదీ బుధవారం రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 11వ తేదీ గురువారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి రాయభార మహోత్సవం, 12 తేదీ శుక్రవారం ఉదయం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, రాత్రి జ్యోతి మహోత్సవం ఉంటాయని అన్నారు. 13వ తేదీ శనివారం సాయంత్రం రథోత్సవం, 14వ తేదీ రథం తిరిగి రావడం, 15వ తేదీ వసంతోత్సవం ఉంటాయని తెలిపారు.

అమ్మవారి జ్యోతి ఉత్సవాల పోస్టర్ విడుదల

బనగానపల్లె, ఏప్రిల్ 3: మండలంలోని నందవరం దేవస్థానంలో చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం చీఫ్ ఫెస్టివల్ అధికారి గురుప్రసాద్, ఆలయ ఈవో కామేశ్వరమ్మలు విడుదల చేశారు. కార్యక్రమంలో గద్వాల డీఈవో మోహన్, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, వేద పండితులు, పూజారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవ చేయాలి

కోవెలకుట్ల, ఏప్రిల్ 3: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం కావాలని కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కోరారు. బుధవారం డిగ్రీ కళాశాలలో నంద్యాల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఎన్ఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశాంక్ పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3: మండలంలోని బెలుం గ్రామంలో పలుకూరు బాషా బోరు రిపేరు చేసి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన హుసేని, అమడాల శ్రీనుతోపాటు మరో నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరచినట్లు సీఐ గోపీనాథరెడ్డి బుధవారం తెలిపారు. నిందితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మిరప పంటకు నిప్పు

అవుకు, ఏప్రిల్ 3: మండలంలోని మెట్టుపల్లె గ్రామంలో దూదేకుల దస్తగిరి అనే రైతుకు చెందిన మిరప పంటకు బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. రైతు దస్తగిరి మిరపపంట కోసం కళ్లంలో ఆరబోశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మిరప పంట పూర్తిగా కాలిపోయిందని వాపోయారు.

'పది హాల్ టికెట్ నెంబరుతో ఇంటర్ అడ్మిషన్'

నంద్యాల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల హాల్ టికెట్ నెంబరుతో ఇంటర్ అడ్మిషన్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని కోటకందుకూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు బుధవారం తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు మే 22వ తేదిలోగా నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా అప్లికేషన్ ఫీజు చెల్లించిన తరువాత వచ్చే జనరల్ నెంబరు ఆధారంగా వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్:/ఏపీఎంఎస్.ఏపీసీటీఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయడానికి ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాలని చెప్పారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వంఈ నెల 6వ తేదీ వరకు గడువును పొడిగించిందని చెప్పారు.

చెన్నూరు పాఠశాలలో రికార్డుల తనిఖీ

శిరివెళ్ల, ఏప్రిల్ 3: మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని రికార్డులను సమాచార హక్కు చట్టం-2005 దరఖాస్తు ద్వారా పరిశీలించినట్లు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. పాఠశాలకు మంజూరైన నిధులు, వాటిని సంబంధించిన ఖర్చులు, బిల్లులు తదితర వాటిని పరిశీలించానని చెప్పారు. జిరాక్స్ ప్రతులు, స్వీట్లు, రవాణా తదితర వాటికి సంబంధించిన బిల్లులను గతంలో పని చేసిన హెచ్‌ఎం టాంపరింగ్ చేసినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. సమగ్ర వివరాలతో జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సతీష్ కుమార్ తెలిపారు. ఎంఈవో శంకర్ ప్రసాద్, హెచ్‌ఎం విజయ విద్యావతి ఉన్నారు.

పింఛన్ విషయంలో రాజకీయం సిగ్గుచేటు



ఇంటింటి ప్రచారం చేస్తున్న భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఏప్రిల్ 3: పింఛన్ విషయంలో లబ్ధి పొందేందుకు వైసీపీ రాజకీయం చేయడం సిగ్గు చేటని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని బుగ్గ రస్తా వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 కరపత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ చేసే కుట్రలను ఎన్నికల కమిషన్ భగ్నం చేసిందని అన్నారు.పింఛన్‌లను వలంటీర్లకు బదులు ప్రత్యామ్నాయ విధానాలతో పంపిణీ చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్‌దారులకు రూ.4 వేలు నేరుగా లబ్ధిదారుడికి ఇంటి వద్దకే అందజేస్తామని అన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న పింఛన్ నిర్ణయాన్ని టీడీపీపై రుద్దడం సబబు కాదన్నారు. టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, నాగరాజు, నరసింహులు, ఉసేన్‌వలి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.